# చీరలకు ఆర్డర్ - సిరిసిల్ల నేతన్నలు చేతినిండా పని

**-ఇందిరా మహిళాశక్తి చీరల ఆర్డర్**
**-గడువులోగా మొదటి చీర ఇవ్వాలి**
**-రెండో చీర ఆర్డర్‌కు సిద్ధం కావాలి**
**-దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్**
**-బతుకమ్మ చీరల బకాయిలు -280 కోట్లు చెల్లించాం**
**-50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు**
**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల, జూన్ 16:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల చేనేత పరిశ్రమను ఆదుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి సిరిసిల్ల చేనేత పరిశ్రమకు అప్పగించినట్లు తెలిపారు. దీంతో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పిస్తున్నామని చెప్పారు. సిరిసిల్లలోని గణేష్ నగర్ లో ఉన్న మామిడాల నారాయణ, కొండ సుభాష్ కు చెందిన మరమగ్గాల యూనిట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య మాట్లాడారు. సిరిసిల్ల చేనేత పరిశ్రమను ఆదుకుంటామన్నారు. అవసరమైన ఆర్డర్లన్నీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రెండో చీర ఆర్డర్ కు సిద్ధం కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

**చీరల ఉత్పత్తి పరిశీలన**

ఈ సందర్భంగా వారు చీరల ఉత్పత్తిని పరిశీలించారు. అలాగే కార్మికులైన వేముల శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్ తదితర కార్మికులతో ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ మాట్లాడారు. ప్రతి రోజు ఎన్ని మీటర్ల చీర ఉత్పత్తి చేస్తున్నారని వారానికి ఎంత ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. చీరల ఉత్పత్తిలో ఏమైనా ఇబ్బంది



ఎదురవుతున్నాయని ఆరా తీశారు. తమకు ప్రతివారం రూపాయలు 4000 నుంచి 5000 వరకు ఆదాయం వస్తుందని కార్మికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు చేతినిండా పని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళ శక్తి కింద చీరల ఉత్పత్తి ఆర్డర్లు అందించామని తెలిపారు.

**కార్మికులు, ఆసాములు కోరిన విధంగా ధర నిర్ణయం**

చేనేత కార్మికులు, ఆసాములు కోరిన విధంగా ధర నిర్ణయిస్తామని వేముల శ్రీనివాస్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు, ఆసాములకు దాదాపు ఎనిమిది నెలల పాటు ఉపాధి లభిస్తుందని చెప్పారు. గతంలోని బతుకమ్మ చీరల బకాయిలు దాదాపు 280 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు.

# సేవలు, డిజిటల్ పరివర్తనలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పిన హైదరాబాద్ బర్కత్‌పురా ఈపీఎఫ్ఓ

న్యూఢిల్లీ, జూన్ 17:1952 నుంచి పనిచేస్తున్న హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయానికి కొనసాగింపుగా ప్రారంభమైన బర్కత్‌పురాలోని ఉద్యోగ భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) కార్యాలయం మరోసారి తన ఘనతను చాటుకుంది.



2024-25 సంవత్సరంలో సేవలను అందించటం, డిజిటల్‌కు మారటం, ఆర్థికంగా మళ్లీ మంచి స్థాయిలోకి రావటం వంటి అద్భుతమైన విజయాలు సాధించడం ద్వారా సామాజిక భద్రతకు సంబంధించిన సేవల విషయంలో నాయకత్వ స్థానాన్ని మరోసారి నిలబెట్టుకుంది.

తెలంగాణలోని ఆరు జిల్లాల్లో ఈపీఎఫ్, పింఛను సేవలకు కీలకమైన కేంద్రంగా పనిచేస్తోన్న బర్కత్‌పురా కార్యాలయం 34,241 సంస్థలను పర్యవేక్షిస్తోంది.. 27.47 లక్షల ఖాతాలను నిర్వహిస్తోంది.. 6.77 లక్షల మంది క్రియాశీల చందాదారులు, 1.14 లక్షల మంది పింఛనుదారులకు సేవలందిస్తోంది.

**2024-25లో సాధించిన ప్రధాన విజయాలు**

ఈపీఎఫ్ఓ ప్రధాన కార్యాలయం తీసుకొచ్చిన అనేక ముఖ్యమైన కార్యక్రమాలను ఈ కార్యాలయం సమర్థవంతంగా అమలు చేసింది. అవి :

ఆటోమేటిక్ క్లెయిమ్ సెటిల్మెంట్లను పెంచటం: నెలకు సగటున 30,001 క్లెయిమ్‌లు ఆటోమెటిక్‌గా పరిష్కారమౌతున్నాయి. ఈ కార్యాలయం ప్రాసెసింగ్ సమయాన్ని 10 రోజుల నుంచి కేవలం 3?4 రోజులకు తీసుకొచ్చింది. దీనితో సభ్యులకు తొందరగా సేవలు అందుతున్నాయి.

కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థ (సీపీపీఎస్): దేశవ్యాప్తంగా ఎక్కడినుంచైన పింఛను తీసుకునే సేవలను ప్రారంభించింది. ఇది ఏ బ్యాంకు నుంచైనా పింఛనుదారులు ప్రయోజనాలు పొందేలా చేసింది.

ముఖ గుర్తింపు సాంకేతిక(ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీ): పింఛనుదారులు స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించి ఇంటి నుంచే డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రాన్ని(లైఫ్ సర్టిఫికెట్) సమర్పించేందుకు వీలు కల్పించింది. ఇది భౌతిక కేంద్రాలను సందర్శించాల్సిన అవసరాన్ని తొలగించింది.

కాగిత రహిత సేవల విషయంలో సంస్కరణలు: ఆధార్-యూఏఎన్ అనుసంధానానికి సంబంధించి నిబంధనలను అనుసరించి చెక్కులను సమర్పించటం, ఉద్యోగం కల్పించిన సంస్థల ధ్రువీకరణను తొలగించింది. తద్వారా క్లెయిమ్ సెటిల్మెంట్ వేగవంతమైంది.

వీటితో పాటు నెలకు సగటున 66,379 క్లెయిమ్‌లను ఈ కార్యాలయం సెటిల్ చేసింది. నెలవారీగా 5,988 ఫిర్యాదులను పరిష్కరిస్తోంది. వీటి ద్వారా సభ్యులకు లేవనెత్తిన అంశాలపై వేగంగా స్పందించటం, పారదర్శకతత విషయంలో తన నిబద్ధతను తెలియజేసింది.

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సంస్కరణలు మాత్రమే కాకుండా సభ్యులే కేంద్రంగా అనేక సేవలను బర్కత్‌పురా కార్యాయం అందించింది. అవి:

మహిళా సహాయ కేంద్రం: మహిళా ఈపీఎఫ్ సభ్యులకు ప్రత్యేకమైన సహాయ వ్యవస్థ

మరణ క్లెయిమ్‌ల విషయంలో తనిఖీ డెస్క్: వియోగ సమయంలో వేగంగా ప్రాసెస్ చేయటం

డిజిటల్ టచ్‌స్క్రీన్ కియోస్క్: ఈపీఎఫ్ఓలో తరచూ అడిగే ప్రశ్నలు(ఎఫ్ఓక్యూ), సమాచారంతో కూడిన వీడియోలకు అందించే వెసులుబాటు

కార్యాలయంలో పనిచేసే సిబ్బంది మంచిచెడుల ప్రాముఖ్యతను గుర్తిస్తూ విధులు నిర్వహిస్తోన్న తల్లిదండ్రుల పిల్లలను చూసుకునే సదుపాయాన్ని అందించింది. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలను కూడా నిర్వహించింది. ఏడాది పొడవునా స్వచ్ఛత, సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టింది. గోడలపై చిత్రాలు, శుభ్రత కార్యక్రమాలతో కార్యాలయ వాతావరణం మారిపోయింది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో సంస్థలు బకాయి ఉన్న దానిలో 90 శాతాన్ని వసూలు చేసింది. ఇది ఆర్థికంగా ఈపీఎఫ్ఓ పరిస్థితిని, సభ్యులకు ప్రయోజనాల అందించటంలో గణనీయంగా దోహదపడింది.

నెలవారీ పింఛన్ల రూపంలో మొత్తం రూ. 48.41 కోట్లు.. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ బీమా(ఈడీఎల్ఐ) పథకాల కింద రూ. 153.95 కోట్లు పంపిణీ చేసింది. శ్రామిక శక్తికి ఆర్థిక భద్రత అందేలా చూడటంలో ఈ కార్యాలయం పాత్రను ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ప్రజా సేవలనందించటంలో ఈ కార్యాలయం పాటిస్తోన్న ఉన్నత ప్రమాణాలకు గుర్తింపుగా భవిష్య నిధి అవార్డులు-2024లో ఉత్తమ ఫిర్యాదు నిర్వహణ కార్యాలయం విభాగంలో అవార్డు లభించింది.

ఎక్కువ వేతనాల విషయంలో పింఛనుకు(పీఓహెచ్‌డబ్ల్యూ-పెన్షన్ ఆన్ హయ్యర్ వేజెస్) సంబంధించి 2022 నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయటంలో బర్కత్‌పురా దేశంలోనే ముందుంది. అందిన దరఖాస్తులలో 98 శాతం(1,18,492 లో 1,17,054) ప్రాసెస్ చేసింది. దీని ద్వారా అర్హత కలిగిన సభ్యులకు సమయానుకూలంగా, సమర్థవంతంగా పింఛను ప్రయోజనాలను అందించింది.

సేవలందించే తీరును నిరంతరం మెరుగుపరిచేందుకు చేపడుతోన్న కార్యక్రమాల్లో భాగంగా మరింత అందుబాటులో ఉండే, ఆధునాతర పద్ధతుల్లో సేవలను అందించేందుకు ప్రజా సేవల కేంద్రం(ఫెసిలిటేషన్ సెంటర్), వీఆర్ఓ డెన్‌ను పునరాభివృద్ధి చేసింది. ఈపీఎఫ్ఓ బర్కత్‌పురా పనితీరు సభ్యులందరికీ సామాజిక భద్రత పారదర్శకంగా, సాంకేతికత అధారంగా అందేలా చూసుకోవటంలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను నిదర్శనంగా నిలుస్తోంది.

# భారత్, సైప్రస్ దేశాల మధ్య సమగ్ర భాగస్వామ్య అమలుపై సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 17:అధికారిక పర్యటన నిమిత్తం రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్‌కు వెళ్లిన భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడ్యులైడ్స్ స్వాగతం పలికారు. సైప్రస్‌లో ప్రధాని జూన్ 15,16 లలో పర్యటిస్తారు. గడచిన రెండు దశాబ్దాల్లో భారత ప్రధాని సైప్రస్‌ను సందర్శించడం ఇదే మొదటి సారి. ఈ చరిత్రాత్మక మైలు రాయి.. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న దృఢమైన స్నేహాన్ని సూచిస్తుంది. ఈ పర్యటన ఉమ్మడి చరిత్రను మాత్రమే కాకుండా.. రెండు దేశాల వ్యూహాత్మక దృక్పథం, పరస్పర నమ్మకం, గౌరవంతో కూడిన భాగస్వామ్య భవిష్యత్తుకు నిదర్శనంగా నిలుస్తుంది

సైప్రస్, భారత్ మధ్య పెరుగుతున్న సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధాన దృష్టి సారిస్తూ, ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై రెండు దేశాల నాయకులు విస్తృతంగా చర్చించారు. ఆర్థిక, సాంకేతిక, ప్రజల మధ్య సంబంధాల్లో సాధించిన పురోగతిని వారు స్వాగతించారు. ఇది రెండు దేశాల మధ్య వృద్ధి చెందుతున్న శక్తిమంతమైన స్నేహబంధాన్ని ప్రతిబింబిస్తుంది.

విలువలు, ఆసక్తులు, అంతర్జాతీయ దృక్పథం, ఆలోచనలపై పెరుగుతున్న సమన్వయాన్ని గుర్తిస్తూ.. ఈ భాగస్వామ్యాన్ని కీలక రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇరు పక్షాలు దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సంక్షేమం, స్థిరత్వానికి దోహదపడే నమ్మకమైన, ఆవశ్యక భాగస్వామ్యులుగా సైప్రస్, భారత్ తమ సహకారాన్ని మరింత పెంపొందించేందుకు కట్టుబడి ఉన్నాయి.

శాంతి, ప్రజాస్వామ్యం, న్యాయం, ప్రభావవంతమైన బహుపాక్షికత్వం, సుస్థిరమైన అభివృద్ధి విషయంలో ఇరు దేశాల నాయకులు తమ ఉమ్మడి అంకితభావాన్ని తెలియజేశారు. ఐక్యరాజ్యసమితి నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా క్రమబద్ధమైన నియమ ఆధారిత అంతర్జాతీయ శాంతికి తమ మద్దతును పునరుద్ఘాటించారు. నౌకా స్వేచ్ఛ, సముద్ర హక్కుల్లో సార్వభౌమత్వానికి సంబంధించి సముద్ర చట్టంపై ఐక్యరాజ్యసమితి సమావేశం (యూఎన్‌సీఎల్‌ఓఎస్)కు చర్చల్లో ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు.

అన్ని దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు ఇరువురు నాయకులు తమ మద్దతును ప్రకటించారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధంతో సహా అంతర్జాతీయ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. అంతర్జాతీయ అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక వ్యవస్థ ప్రాధాన్యంపై కూడా ఇద్దరు నాయకులు చర్చించారు. అణ్వాయుధాలను సరఫరా చేసే దేశాల సమూహంలో భారత్‌కున్న విలువను గుర్తించారు.

ఐక్యరాజ్యసమితి, కామన్వెల్త్ సహా అంతర్జాతీయ సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశాన్ని నాయకులు వ్యక్తం చేశారు. అలాగే 2024 అపియా కామన్వెల్త్ ఓషన్ డిక్లరేషన్ ను అమలు చేసేందుకు కలిసి పనిచేయడానికి రెండు దేశాలు అంగీకరించాయి. ఈ ఒప్పందాన్నిఅంతర్జాతీయ స్థిరత్వానికి సముద్ర కార్యకలాపాల మూలాధారంగా పేర్కొన్నాయి. ఇదే అంశంపై సైప్రస్‌లో ఏప్రిల్ 2024లో జరిగిన కామన్వెల్త్ సముద్ర దేశాల మంత్రిత్వ స్థాయి మొదటి సమావేశం జరిగింది. ఇది కామన్వెల్త్ సభ్యదేశాల్లో సుస్థిరమైన సముద్ర కార్యకలాపాల నిర్వహణను ముందుకు తీసుకెళ్లడానికి, సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన బ్లూ చార్టర్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటును తెలియజేస్తుంది.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించాల్సిన అవసరాన్ని ఇద్దరు నాయకులు చర్చించారు. దాన్ని మరింత ప్రభావవంతంగా, సమర్థంగా మార్చడానికి, సమకాలీన భౌగోళిక రాజకీయ సవాళ్లను తెలియజెప్పే మార్గాలపై సైతం చర్చించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించే ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వాల మధ్య సంప్రదింపులను ముందుకు తీసుకెళ్లడానికి నాయకులిద్దరూ మద్దతు ప్రకటించారు. అలాగే రాతపూర్వక ఒప్పంద ఆధారిత చర్చల ద్వారా దీన్ని ముందుకు తీసుకెళ్లే నిరంతర ప్రయత్నాల పట్ల తమ నిబద్ధతను స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వాన్ని ఇచ్చేలా తన మద్దతు ఇస్తానని సైప్రస్ తెలియజేసింది.

ఐక్యరాజ్యసమితిలో ఒకరికొకరు సహకరించుకోవడానికి, బహుపాక్షిక వేదికల్లో ఒకరి అభ్యర్థిత్వాన్ని మరొకరు బలపరిచేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి.

వివిధ రంగాలలో సమన్వయాన్ని క్రమబద్ధీకరించడానికి, సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి క్రమం తప్పకుండా చర్చలు జరపాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. దీనికోసం సైప్రస్ రిపబ్లిక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మధ్య ఉన్న ద్వైపాక్షిక యంత్రాంగాలను ఉపయోగించాలని నిర్ణయించాయి. ఈ మంత్రిత్వ శాఖలు రెండు దేశాలకు చెందిన సమర్థులైన అధికారులతో సన్నిహిత సమన్వయం ద్వారా కార్యాచరణ ప్రణాళికలో చేర్చాల్సిన సహకార రంగాల పనితీరును సమీక్షించి, పర్యవేక్షిస్తాయి.

దీర్ఘకాలంగా సైప్రస్ ఎదుర్కొంటున్న సంక్షోభానికి సమగ్రమైన, శాశ్వతమైన పరిష్కారాన్ని సాధించే ప్రయత్నాలను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పున:ప్రారంభించే దిశగా తమ దృఢమైన సంకల్పాన్ని రెండు దేశాలు వ్యక్తం చేశాయి. ఐక్యరాజ్యసమితి నిబంధనలు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా సమానత్వంతో కూడిన బైజోనల్, బైకమ్యూనల్ ఫెడరేషన్ ఆధారంగా ఈ చర్యలు పున:ప్రారంభం కావాలని రెండు దేశాలు ఆకాంక్షించాయి.

రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, ఐక్యత విషయంలో సంపూర్ణ మద్దతును అందిస్తున్నట్టు భారత్ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా అర్థవంతమైన చర్చల పున:ప్రారంభానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో ఏకపక్ష చర్యలకు తావు లేకుండా చూడాల్సిన అవసరాన్ని రెండు పక్షాలు స్పష్టం చేశాయి.

**భద్రత, రక్షణ, సంక్షోభ సమయంలో సహకారం**

అంతర్జాతీయ, సీమాంతర ఉగ్రవాదంతో సహా అన్ని రూపాల్లోని ఉగ్రవాద, హింసతో కూడిన అతివాద చర్యలను సైప్రస్, భారత్ ఖండించాయి. శాంతి, సుస్థిరతకు భంగం కలిగించే ఈ తరహా ముప్పులను ఎదుర్కోవడానికి ఉమ్మడి అంకిత భావాన్ని స్పష్టం చేశాయి.

సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ సాగిస్తున్న పోరాటానికి సైప్రస్ సంఘీభావాన్ని, మద్దతును తెలిపింది. ఇటీవలే భారత్‌లో జమ్ముకాశ్మీర్లోని పహల్గాంలో అమాయక పౌరుల ప్రాణాలను అత్యంత పాశవికంగా బలిగొన్న సంఘటనను ఇరు నాయకులు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని, అలాంటి చర్యలను సమర్థించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ దాడులకు పాల్పడిన వారిని పరిణామాలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు.

ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించాలని, సీమాంతర ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఖండించాలని నాయకులు అన్ని దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాద ఆర్థిక వ్యవస్థలను విచ్ఛిన్నం చేయాలని, వాటి స్థావరాలను నాశనం చేయాలని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారిని చట్టం ముందు నిలబెట్టాలని పిలుపునిచ్చారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర, సమన్వయ, సుస్థిర విధానాన్ని అవలంబించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అలాగే సహకార ధోరణిలో ద్వైపాక్షికంగా, బహుపాక్షికంగా పని చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు.

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు బహుపాక్షిక ప్రయత్నాలను బలోపేతం చేయడానికి తమ నిబద్ధతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు. అలాగే ఐక్యరాజ్య సమితి నియమాలకు లోబడి అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమగ్ర ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేసి ఆమోదించాలని వారు పిలుపునిచ్చారు. 1267 యూఎన్ఎస్‌సీ ఆంక్షల కమిటీ ప్రకారం ఉగ్రవాదులతో సహా ఐక్యరాజ్యసమితి, ఈయూ నిషేధించిన ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు, అనుబంధ ప్రాక్సీ గ్రూపులు, వాటికి సహాయం చేసేవారు, మద్దతుదారులపై సంఘటితంగా చర్య తీసుకోవాలని వారు కోరారు. ఐక్యరాజ్యసమితి, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ద్వారా ఉగ్రవాద నిధుల మార్గాలను విచ్ఛిన్నం చేయడానికి చురుకైన చర్యలు తీసుకోవడం, వాటిని కొనసాగించడానికి వారు తమ అచంచలమైన సంకల్పాన్ని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ భద్రతకు సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయన్న విషయాన్ని నేతలు అంగీకరిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, రక్షణ సన్నద్ధతలతో పాటు రక్షణ సామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేశారు.

రక్షణపరమైన, భద్రతపరమైన సహకారాన్ని విస్తరించుకోవాలని వారు అంగీకరించారు. దీనిలో భాగంగా తమ రక్షణ రంగ పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంచుకోవాలనీ, సైబర్ సెక్యూరిటీపైనా, ఇప్పుడిప్పుడే ఉనికిలోకి వస్తున్న సాంకేతికతలపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు వారు సమ్మతించారు.

భారత్‌తో పాటు సైప్రస్ సుదీర్ఘ నౌకాదళ చరిత్రను కలిగి ఉన్న నౌకావాణిజ్య దేశాలన్న సంగతిని నేతలు గుర్తిస్తూ, నౌకావాణిజ్య రంగం సహా ఇతరత్రా సహకారాన్ని పెంపొందించుకోవడాన్ని గురించి కూడా చర్చించారు. భారతీయ నౌకాదళానికి చెందిన నౌకలు సముద్రయానంలో భాగంగా రెగ్యులర్ పోర్ట్ కాల్స్ ప్రోత్సహించడంతో పాటు సంయుక్త శిక్షణ, అభ్యాస కార్యకలాపాల నిర్వహణకు అవకాశాలు ఏ మేరకు ఉన్నదీ అన్వేషించాలనీ, నౌకావాణిజ్యంలో చైతన్యాన్నీ, ప్రాంతీయ భద్రతనూ పెంచుకోవాలనీ వారు అభిప్రాయపడ్డారు.

ఇదే విధంగా, ప్రస్తుతం ప్రపంచంలో పలు చోట్ల సంకట స్థితులు కొనసాగుతూ ఉన్న నేపథ్యంలో, అత్యవసర సన్నద్ధతతో పాటు సమన్వయ ఎదురైతే సమన్వయపూర్వకంగా ప్రతిస్పందించే విషయాల్లో పరస్పర సహకారాన్ని బలపరచుకొందామంటూ ఇరు పక్షాలు నిబద్ధతను వ్యక్తం చేశాయి. గతంలో తమ ప్రయత్నాలు సఫలం అయిన సందర్భాలను నేతలు గుర్తుకు తెచ్చుకొంటూ, ఆపదలో చిక్కుకొన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ, జాడ తెలియని వారిని గుర్తించడం, రక్షించడం(ఎస్ఏఆర్) వంటి కార్యకలాపాలలోనూ సమన్వయ బాధ్యతను సంస్థాగతీకరించడానికి నేతలు అంగీకరించారు.

సైప్రస్, భారత్‌లు ఈ ప్రాంతాల మధ్య వారధులుగా పనిచేయాలనే వ్యూహాత్మక దృక్పథాన్ని కలిగి ఉన్నాయి. మార్పునకు కారణం కాగల, మల్టి-నోడల్ కార్యక్రమంగా ఇండియా-మిడిల్ ఈస్ట్- యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ)కి ఉన్న ప్రాధాన్యాన్ని నేతలిద్దరూ ప్రధానంగా ప్రస్తావించారు. ఇది శాంతినీ, ఆర్థిక సమగ్రతనూ, స్థిరాభివృద్ధినీ పెంపొందించగలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

ఫలప్రద ప్రాంతీయ సహకారానికి ఒక ఉత్ప్రేరకంగా ఐఎంఈసీ పనిచేయగలదని తలపోస్తూ, తూర్పు మధ్యధరా ప్రాంతంలోనూ, సువిశాల మధ్య ప్రాచ్యంలోనూ స్థిరత్వాన్ని ప్రోత్సహించడం కోసం తమ రెండు పక్షాలు కట్టుబడి ఉన్నాయని పునరుద్ఘాటించారు. భారత్ ద్వీపకల్పం మొదలు సువిశాల మధ్య ప్రాచ్యం నుంచి యూరప్ గుండా పరస్పర అనుసంధానిత కారిడార్లు, ఇప్పటి కన్నా ఎక్కువ సంబంధాన్ని కలిగి ఉండేందుకు పెద్దపీట వేయాలని వారు స్పష్టం చేశారు.

యూరప్‌నకు ప్రవేశద్వారంగా సైప్రస్ పోషిస్తున్న పాత్రనూ, ఇదే సందర్భంలో, నౌకలు వాటి తుది గమ్యస్థానానికి చేరే కన్నా ముందు, ఒక నౌక నుంచి మరొక నౌక లోకి రవాణా సరకును బదలాయించే ప్రక్రియ (ట్రాన్స్‌షిప్‌మెంట్), నిల్వ, పంపిణీ, ఆధునిక రవాణా వ్యవస్థ.. ఈ కార్యకలాపాలకు ఓ ప్రాంతీయ కూడలిగా ఎదగగల అవకాశాలు సైతం సైప్రస్‌కు ఉన్నాయని నేతలు గుర్తించారు. భారతీయ నౌకావాణిజ్య కంపెనీలు సైప్రస్‌లో వాటి వాణిజ్యం నిర్వహించుకునేందుకు అవకాశాలు ఉన్నాయంటూ నేతలు దీనిని స్వాగతించారు.

# సైప్రస్, భారత వాణిజ్య రంగ ప్రముఖులతో ప్రధానమంత్రి, సైప్రస్ అధ్యక్షుల భేటీ

న్యూఢిల్లీ, జూన్ 17:సైప్రస్ అధ్యక్షుడు శ్రీ నికోస్ క్రిస్టోడౌలిడెస్‌తో కలసి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సైప్రస్, భారత్ వాణిజ్య రంగ ప్రముఖులతో లిమాసోల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు, రక్షణ, ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్), నౌకావాణిజ్యం, షిప్పింగ్, సాంకేతికత, నవకల్పన, డిజిటల్ సాంకేతికలు, కృత్రిమ మేధ, ఐటీ సర్వీసులు, పర్యటన, రవాణావంటి భిన్న రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు.

గత 11 సంవత్సరాల్లో భారత లో శరవేగంగా చోటుచేసుకొన్న ఆర్థిక మార్పును ప్రధానమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. రాబోయే కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అమల్లోకి తెచ్చిన సంస్కరణలు, విధానాల్లో అనూహ్య మార్పులకు తావివ్వక పోతుండడం, నిలకడతనంతో కూడిన ప్రజాస్వామ్య ప్రక్రియ.. వీటితో పాటు 'వ్యాపార నిర్వహణలో సౌలభ్యం'లతో ప్రపంచంలో అన్ని దేశాల కన్నా శరవేగంగా ముందుకు పోతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ మారిందని ఆయన వివరించారు. నవకల్పన, డిజిటల్ విప్లవం, అంకుర సంస్థలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మరీ అభివృద్ధి చేస్తున్న మౌలిక సదుపాయాలు.. వీటి అన్నింటికీ పెద్దపీట వేస్తున్నామని ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచంలో అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఇండియా కొన్ని సంవత్సరాల్లో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారేందుకు అనువైన స్థితిలో ఉందని ఆయన తెలిపారు. పౌర విమానయానం, ఓడరేవులు, నౌకానిర్మాణం, డిజిటల్ మాధ్యమంలో చెల్లింపులు, పర్యావరణానికి హాని చేయని రీతిన అభివృద్ధి సాధన దిశలో పయనం.. వీటిలో భారత్ స్థిరంగా ముందుకు దూసుకుపోతోందని ఆయన వివరించారు. దీంతో భారత్‌తో చేయి కలపడానికి సైప్రస్ కంపెనీలకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులు, అంకుర సంస్థల అనుబంధ విస్తారిత వ్యవస్థ భారత్‌కున్న బలాలు అని ప్రధానమంత్రి చెబుతూ, ఇదే సందర్భంలో ఇండియా వృద్ధి గాథకు తోడ్పాటును అందిస్తున్న తయారీ, ఏఐ, క్వాంటమ్, కీలక ఖనిజాల రంగాల గురించి కూడా ప్రధానంగా ప్రస్తావించారు.

భారత్‌కు ఒక ప్రధాన ఆర్థిక భాగస్వామి దేశంగా సైప్రస్ ఉందని, మరీ ముఖ్యంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) రంగంలో వెన్నుదన్నుగా నిలుస్తోందని ప్రధానమంత్రి చెబుతూ, భారతదేశ ఆర్థిక రంగంలో కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి సైప్రస్ ఎంతో ఆసక్తిని కనబరుస్తుండటాన్ని ఆహ్వానించారు.

ఆర్థిక సేవల రంగంలో వాణిజ్య అనుబంధాన్ని ఏర్పరచుకోవడానికి అవకాశాలు ఉన్నాయని నేతలు ఇద్దరూ ప్రధానంగా ప్రస్తావిస్తూ, గుజరాత్‌లోని ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ 'గిఫ్ట్ సిటీ'కి, సైప్రస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదరడాన్ని స్వాగతించారు. రెండు దేశాల మధ్య సీమాంతర చెల్లింపుల కోసం యూపీఐని ప్రారంభించడానికి ఎన్ఐపీఎల్ (ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్), యూరోబ్యాంక్ సైప్రస్‌లు ఒక అవగాహనకు వచ్చాయి. ఇది పర్యాటకులకు, వాణిజ్య సంస్థలకు మేలు చేయనుంది. భారత్-గ్రీస్-సైప్రస్ (ఐజీసీ) బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కౌన్సిల్ ప్రారంభం కావడాన్ని కూడా ప్రధానమంత్రి ప్రశంసించారు. ఇది షిప్పింగ్, లాజిస్టిక్స్, పునరుత్పాదక ఇంధనం, పౌర విమానయానం, డిజిటల్ సర్వీసుల వంటి రంగాల్లో త్రైపాక్షిక సహకారం పెరిగేందుకు దోహదపడనుంది. అనేక భారతీయ కంపెనీలు సైప్రస్‌ను యూరప్‌నకు ఒక ప్రవేశద్వారంగా, ఐటీ సర్వీసులు, ఆర్థిక నిర్వహణ, పర్యటనలకు కూడలి (హబ్)గా భావిస్తున్నాయన్న వాస్తవాన్ని ప్రధానమంత్రి స్వాగతించారు.

వచ్చే ఏడాదిలో ఈయూ కౌన్సిల్‌కు అధ్యక్ష బాధ్యతను స్వీకరించడానికి సైప్రస్ సన్నద్ధం అవుతున్న క్రమంలో, నేతలు ఇద్దరూ భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపరచడానికి తాము నిబద్ధులమంటూ పునరుద్ఘాటించారు. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ సంవత్సరం చివరికల్లా తుది రూపు సంతరించుకోగలదన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం కొలిక్కి వస్తే ఉభయ దేశాల వాణిజ్య, ఆర్థిక సహకారానికి పెద్ద ఊతం లభిస్తుంది. వాణిజ్య రౌండ్ టేబుల్ సమావేశం ఆచరణాత్మక సూచనలు-సలహాలను అందించిందనీ, ఇవి ఒక సువ్యవస్థిత ఆర్థిక రోడ్‌మ్యాప్‌నకు ఆధారంగా మారగలవనీ, దీంతో వాణిజ్యం, నవకల్పన, వ్యూహాత్మక రంగాల్లో దీర్ఘకాలిక సహకారం రూపుదాల్చనుందనీ ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

ఉమ్మడి ఆకాంక్షలు, భవిష్యత్తుపై దృష్టిని కేంద్రీకరించిన విధానాలతో భారత్, సైప్రస్‌లు హుషారైన, పరస్పరం ప్రయోజనకారి ఆర్థిక సహకార పూర్వక నవశకాన్ని ఆవిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాయి.

# యోగా మన వారసత్వ సంపద : మంత్రి టీజీ భరత్



కర్నూలు బ్యూరో, జూన్ 17: వేల సంవత్సరాల నుండి వస్తున్న యోగా మన వారసత్వ సంపద అని, చదువుతో పాటు ఆరోగ్యంగా ఉండడం కూడా ముఖ్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. ఇవాళ ఉదయం కర్నూలు నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు ఎన్ సీసీ విద్యార్థులు, మహిళలు, అధికారుల భాగస్వామ్యంతో 5వేల మందితో నిర్వహించిన థీమాటిక్ యోగా ప్రదర్శన నిర్వహించారు.. యోగా శిక్షకులు మునిస్వామి యోగా ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు వేయించారు.

అనంతరం భరత్ మాట్లాడుతూయోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు దాదాపు 11లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుని, కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అభినందించారు. యోగా ఐదు వేల సంవత్సరాల నుండి మనకు వారసత్వంగా వస్తోందని, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు యోగా చేయడం అలవర్చుకోవాలని తెలిపారు. ప్రజలకు యోగా పట్ల అవగాహన కల్పించి, ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో మే 21 నుండి జూన్ 21 వరకు నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు.

ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి విశాఖపట్నం సముద్రతీరంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఈ యోగా కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేలాగా ఉంటుందని మంత్రి తెలిపారు.

ఈకార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, సీఈవో సెట్కూర్ వేణుగోపాల్, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, ఎన్ సి సి కల్నల్ ప్రసాద్, డిస్ డి ఓ భూపతి రావు, కార్పొరేటర్ పరమేష్, ఆయుష్ డా.ప్రసాద్, మునిస్వామి, జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్, జిల్లా అధికారులు, మున్సిపల్ శాఖ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఎన్సీసీ విద్యార్థులు, సాధారణ ప్రజలు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అల్లుడి చేతిలో మామ దారుణహత్య

అమరావతి, జూన్ 17:అల్లుడి చేతిలో మామ దారుణ హత్య కు గురైన ఘటన శ్రీకాకుళం జిల్లా మండపల్లి గ్రామంలో కలకలం రేపింది.

మండపల్లి సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బర్రి గంగయ్య (58)ను అతడి అల్లుడు పాతిర్ల జీవన్ రెడ్డి కత్తితో పొడిచి చంపాడు. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# చెత్త సేకరణలో విద్యుత్తు వాహనాల (ఈవీస్) చేరిక పట్టణ స్వచ్ఛ భారత్ పథకం(ఎస్‌బీఎమ్-యూ)లో గణనీయ మార్పులకు సూచిక

న్యూఢిల్లీ, జూన్ 17:స్వచ్ఛ, హరిత భారత్ ఆశయ సాధనలో భాగంగా, ఇంటి చెత్త సేకరణ విధుల్లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీస్)ను ప్రవేశపెట్టారు. దీంతో స్వచ్ఛ్ భారత్ మిషన్- అర్బన్ (ఎస్‌బీఎమ్-యూ)లో ఓ గణనీయ మార్పునకు నాందీప్రస్తావన చేసినట్లయింది. ఈ హరిత వాహనాలు రాబోయే కాలంలో పట్టణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక ప్రాతిపదికను కలిగి ఉండే తరహా పారిశుధ్య ముఖచిత్రాన్ని ఆవిష్కరించగలవు. ఈ ఈవీస్ రోజువారీ వ్యర్థాల సమస్యను సమర్థంగా పరిష్కరిస్తూనే, అదే సమయంలో వాయు కాలుష్యాన్ని, శబ్ద కాలుష్యాన్ని తగ్గించనున్నాయి. సంప్రదాయ ఇంధనంతో నడుస్తున్న చెత్త వాహనాల స్థానంలో విద్యుత్తు వాహనాలు రావడం వల్ల కర్బన ఉద్గారాలను తగ్గడమే కాకుండా నగరాలను శుభ్రంగా ఉంచాలన్న ఎస్‌బీఎమ్-యూ లక్ష్యానికి అనువుగా ఉన్నాయి. పొగకు తావు ఉండని రవాణా సాధనాలతో పాటే ఘన వ్యర్థాల నిర్వహణ.. ఈ రెండిటి మేలుకలయిక పర్యావరణ పరంగా మరింత బాధ్యతాయుత భవిష్యతాకాలానికి బాట వేస్తోంది.

ఇళ్ల నుంచి చెత్తను సేకరించడానికి 200కు పైగా విద్యుత్తు ఆటోలను రంగంలోకి దించి వ్యర్థాల నిర్వహణలో పర్యావరణానుకూల మార్పునకు ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూరు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి, సస్టెయినబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ పైలట్ అప్రోచ్ (ఎస్‌సీఐపీ)లో భాగంగా ఐక్యరాజ్యసమితి పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (యూఎన్ఐడీఓ)తో పాటు గ్లోబల్ ఎన్విరాన్ మెంటల్ ఫెసిలిటీ (జీఈఎఫ్) మద్దతు అందిస్తోంది. వాస్తవ-కాల ప్రాతిపదికన పర్యవేక్షణ కొనసాగాలన్న ఉద్దేశంతో ఈ విద్యుత్తు ఆటోల్లో జీపీఎస్ ట్రాకింగు జోడించారు. ఈ ఆటోలు నగర పరిధిలో మొత్తం 159.46 కి.మీ చుట్టి వస్తున్నాయి. ఏటా 71,000 లీటర్లకు పైగా డీజిల్ వినియోగించాల్సిన అవసరాన్ని నివారించడం ద్వారా, ఈ ప్రాజెక్టు గ్రీన్ హౌస్ గ్యాస్ ఉద్గారాలను చాలావరకు తగ్గించగలుగుతుంది. పది సంవత్సరాల కాలంలో రమారమి 21,000 టన్నుల ఉద్గారాలు వెలువడే ప్రమాదం ఇక ఉండదని ఒక అంచనా. వాయు నాణ్యతను పెంచనుంది. నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు సాంప్రదాయక చెత్త లారీలతో పోలిస్తే విద్యుత్తు ఆటోలు మరింత ఎక్కువ కాలం పనిచేయగలిగేవి కావడంతో, ఈ రకం వాహనాలు వ్యర్థాల నిర్వహణకు నగరపాలక సంస్థ పెట్టాల్సిన ఖర్చును ఆదా చేసే మార్గాన్ని చూపగలుగుతాయి. దీనికి అదనంగా, ఈ కార్యక్రమం ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటుగా సేవలో విశ్వసనీయతను మెరుగుపరిచి, మొత్తంమీద పట్టణ సుస్థిరత్వానికి దన్నుగా కూడా నిలుస్తుంది.

నగరం అంతటా చెత్త సేకరణకు బ్యాటరీతో తిరిగే ఎలక్ట్రిక్ రిక్షాలను గ్రేటర్ చెన్నయ్ కార్పొరేషన్ (జీసీసీ) ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం పర్యావరణ అనుకూల అభివృద్ధి సాధన లక్ష్యానికి అనుగుణంగా ఉండడం ఒక్కటే కాకుండా వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం వంటి నగర ప్రాంతాల్లోని కీలక సవాళ్లను కూడా పరిష్కరించగలుగుతుంది. ఇ-రిక్షాలు ప్రతి రోజూ ఇంచుమించుగా 40 కి.మీ ప్రయాణించగలవు. డీజిల్‌తో నడిచే లారీలకు బదులుగా ఇ-రిక్షాలు రంగంలోకి రావడంతో, నగరం ప్రతి రోజూ దాదాపు 41 టన్నుల కర్బన ఉద్గారాల బారి నుంచి తప్పించుకోగలుగుతుంది. ఏడాది కాలానికయితే ఇది 15,160 టన్నులుగా లెక్కకు వస్తుంది. ఇళ్లు, వాణిజ్య భవనాలు, నివాసేతర ప్రాంతాల నుంచి చెత్తను రోజూ పోగు చేసి తీసుకుపోవడానికి వీలుగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రత్యేకంగా తయారు చేశారు. తడి చెత్త, పొడి చెత్తలతో పాటు అపాయకార వ్యర్థాల కోసం వేర్వేరు కుండీలను అమర్చిన ఈ ఇ-రిక్షాలు మూలం వద్దే చెత్తను వేరు చేసేందుకు తగిన ఏర్పాట్లను కూడా కలిగి ఉన్నాయి. ప్రస్తుతం, 5,478 ఇ-రిక్షాలను జీసీసీ నిర్వహిస్తోంది. ఇవి నగరంలోని మొత్తం 15 మండలాల్లో 24,621 వీధుల నుంచి చెత్తను తరలించడం ద్వారా 2 కోట్ల 10 లక్షల కుటుంబాలకు సేవలను అందిస్తున్నాయి. ఈ సమగ్ర వ్యవస్థ బహుళ ప్రయోజనాలను అందిస్తోంది. పెట్రోలు-డీజిల్ వంటి సాంప్రదాయక ఇంధనాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గిపోవడం, నిర్వహణ- మరమ్మతు ఖర్చులు తక్కువ కావడం సున్నా స్థాయి ఉద్గారాల వల్ల పర్యావరణానికి కలిగే మేలు చాలా ఎక్కువ. ఈ కార్యక్రమంతో 6,000 మందికి పైగా ఉపాధి లభిస్తోంది. ఇ-రిక్షాలలో శ్రవణ వ్యవస్థల (ఆడియో సిస్టమ్స్)ను జతపరచారు. దీంతో వివిధ వ్యర్థ పదార్థాలను వేరు చేసి అట్టిపెట్టడం ముఖ్యమంటూ ప్రత్యేక పాటలు, సార్వజనిక సమాచార ప్రచారం ద్వారా నగరవాసులను జాగృతం చేయడానికి కూడా వీలవుతోంది.

ఇంటి చెత్త సేకరణకు వాడుతున్న డీజిల్ వాహనాలకు బదులు 100 విద్యుత్తు వాహనాలను (ఇ-వెహికిల్స్)ను ఇండోర్ నగరపాలక సంస్థ ప్రవేశపెట్టి, పర్యావరణ స్థిరత్వంతో పాటుగా నిర్వహణ కార్యకలాపాల సామర్థ్యం దిశగా ఒక పెను మార్పునకు చొరవ తీసుకొంది. ఈ కార్యక్రమం, నగరంలోని రాజ్‌వాడా వంటి ప్రధాన ప్రాంతాలపై శ్రద్ధ తీసుకొంటూ, ఒక సంవత్సరంలో వాతావరణంలోకి చొరబడుతున్న కర్బన ఉద్గారాలను సుమారుగా 24,918 టన్నుల మేరకు తగ్గించడంలో తన వంతుగా తోడ్పాటును అందిస్తోంది. అంతేకాదు, చెత్త రవాణాకు అవసరమయ్యే ఇంధనంతో పాటు నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గడానికి కూడా దోహదపడుతోంది. సమీకృత కమాండ్, కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) పర్యవేక్షణలో వాస్తవ-కాల జీపీఎస్ ఊతం లభిస్తూ ఉండడంతో, ఈ వాహనాలు పారదర్శక సేవలనూ, జవాబుదారీతనాన్నీ పెంపొందించగలుగుతాయి. డీజిల్ వాహనాలకు స్వస్తి పలకడంతో ఇంధనానికీ, ఇంజిన్ ఆయిల్‌కూ, క్లచ్ మార్పిళ్లకూ నగరపాలక సంస్థ పెట్టవలసి వచ్చిన ఖర్చులతో పాటు మరమ్మతులను కూడా లెక్కలోకి తీసుకొంటే, ఏటా దాదాపు రూ. 5.97 కోట్ల వరకు ఆదా అయ్యేందుకు అవకాశం ఉంది. హరిత ప్రధాన వాహనాలను దీర్ఘకాల ప్రాతిపదికన నడపడానికి నగరపాలక సంస్థ 20 సౌర చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఒక్కో స్టేషన్‌లోనూ 10 కేడబ్ల్యూ సౌర శక్తి ఫలకాలు అమర్చారు. వీటికి రోజుకు 800 యూనిట్ల నుంచి 1000 యూనిట్ల హరిత ఇంధనాన్ని అందించే సామర్థ్యం ఉంది. ఈ స్టేషన్లు నిత్యం 80 నుంచి 100 వాహనాలకు విద్యుత్తును సరఫరా చేయగలవు. దీంతో సాంప్రదాయక విద్యుత్తు వనరులపై ఆధారపడడం చాలావరకు తగ్గిపోతుంది.

గుంటూరు, చెన్నైతో పాటు ఇండోర్ వంటి నగరాలు ఈ తరహా మార్గదర్శక ప్రయత్నాలను చేపట్టి 'స్వచ్ఛ్ భారత్ మిషన్-అర్బన్'లో భాగంగా స్వచ్ఛ, ఆకర్షణీయ, మరింత సుస్థిర పట్టణ వ్యర్థపదార్థాల నిర్వహణ దిశగా ఒక ప్రభావవంత మార్పును ఆవిష్కరించే చొరవను తీసుకుంటున్నాయి. విద్యుత్ వాహనాల వినియోగం, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ సాంకేతికతలు.. వీటి వైపు ఈ నగరాలు మొగ్గు చూపి పర్యావరణ పరంగా ప్రతికూల ప్రభావాలను తగ్గించడం ఒక్కటే కాకుండా నిర్వహణ కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని ఇనుమడింపచేయడంతో పాటు, సమాజ శ్రేయస్సుకు కూడా తమ తోడ్పాటును అందిస్తున్నాయి.

## పల్నాడు టూర్‌కు జగన్‌కు అనుమతి

అమరావతి, జూన్ 17:పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాల గ్రామంలో రేపు జరగనున్న వైసీపీ కార్యకర్త నాగ మల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆ పార్టీ అధినేత జగన్ హాజరుకానున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి భద్రతా కారణాల దృష్ట్యా జగన్ తో సహా కేవలం వంద మందికి మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు వెల్లడించారు.

జగన్ పర్యటనకు అనుమతి కోరుతూ సత్తెనపల్లి వైసీపీ ఇన్‌చార్జి సుధీర్ భార్గవ్ రెడ్డి పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన అనంతరం ఎస్పీ కంచి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సుమారు 30 వేల మంది ప్రజలు హాజరవుతారని వైసీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.

అయితే, విగ్రహావిష్కరణ జరిగే ప్రదేశానికి కేవలం పది అడుగుల వెడల్పు ఉన్న దారి మాత్రమే ఉందని, ఆ దారికి ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయని ఎస్పీ వివరించారు. ఈ కారణంగా, ఆ ప్రాంతంలో వంద మంది కంటే ఎక్కువ మంది గుమిగూడటానికి అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాల్లో జరిగిన కొన్ని అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మాజీ సీఎం జగన్ కాన్వాయ్‌తో పాటు అదనంగా మరో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని ఎస్పీ చెప్పారు.

శాస్త్రీయమైన అంచనాల ప్రకారమే అనుమతులు మంజూరు చేస్తున్నామని, ఒకవేళ నిర్దేశించిన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఈ సందర్భంగా హెచ్చరించారు. భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకే తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం లింగాపూర్ రోడ్డుపై పేదల ధర్నా



అమరావతి, జూన్ 17: కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు అర్హులైన నిరుపేదలు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని లింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు, లింగాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగపూర్ గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని, ఇండ్లు, భూములున్నవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని, తమకు భూములు, ఇండ్లు లేకున్నా జాబితాలో తమ పేర్లు రాలేవని, తాము నిరుపేదలమని, దయచేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ను కోరారు.

దాదాపు నాలుగు గంటలు ఎండలో కూర్చొని పేదలు ఆందోళన చేస్తుండడంతో అందులో నుండి ఒక మహిళ ఎండ వేడిమి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది.

కాగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేస్తున్నా.. వారి వద్దకు ఎవరు కూడా వచ్చి ఇందిరమ్మ ఇండ్ల గురించి ఎలాంటి హామీ ఇవ్వలేదు.. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## రైతుల కోసమే రెవెన్యూ సదస్సులు.. రైతులు అటవీశాఖ భూముల జోలికి వెళ్లొద్దు : అదనపు కలెక్టర్ నగేష్



రైతుల కోసమే రెవెన్యూ సదస్సులు.. రైతులు అటవీశాఖ భూముల జోలికి వెళ్లొద్దు : అదనపు కలెక్టర్ నగేష్ రైతుల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామంలో జరిగే భూ భారతి రెవెన్యూ సదస్సుకు హాజరైన అదనపు కలెక్టర్ రైతులను అటవీ శాఖ భూములు, రెవెన్యూ భూములపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతులు ఎప్పటికైనా అటవీశాఖ భూముల జోలికి వెళ్లొద్దన్నారు. ఎప్పటికైనా అటవీశాఖ భూముల హక్కులు అటవీశాఖకే ఉంటాయన్నారు. రెవెన్యూకు సంబంధించిన భూములపై ఏదైనా ఎక్కడైనా అవకతవకలు ఉంటే రెవెన్యూ సదస్సులో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. స్థానికంగా సమస్య పరిష్కారం గాకుంటే కలెక్టర్ ఆదేశాల ప్రకారం పరిష్కారం చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు.

రెవెన్యు ఫారెస్టు భూముల వివాదాలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశ్యమన్నారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి, ఆర్ఐ.గౌస్ తదితరులు ఉన్నారు.

## యోగా శరీరాన్ని, మనస్సును, శ్వాసను ఆలోచనలను ఏకం చేస్తుంది: శ్రీ ఓం ప్రకాశ్ స్వర్ణ




న్యూఢిల్లీ, జూన్ 17:యోగా అనేది భారతీయ ప్రాచీన సంప్రదాయాన్ని ప్రతిబింబించే గొప్ప ఆధ్యాత్మిక పరిచయం అని, ఇది శరీరాన్ని,మనస్సును,శ్వాసను, ఆలోచనలను ఒకే దారిలో ఉంచేలా చేస్తుందని ప్రముఖ యోగా గురువు శ్రీ ఓం ప్రకాశ్ స్వర్ణ అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పత్రికా సమాచార కార్యాలయం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయాలు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు యోగా అవగాహన కార్యక్రమం 'యోగా సంగం' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయ సముదాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా అనేది కేవలం వ్యాయామంగా కాకుండా, సంపూర్ణ జీవన విధానంగా పనిచేస్తుందని ఆయన స్పష్టంగా వివరించారు.యోగా అనేది కేవలం శారీరక సాధనమే కాకుండా, మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుంది.

యోగాను రోజువారీ జీవనశైలిలో భాగంగా చేస్తే శారీరక ఆరోగ్యం మెరుగవుతుంది.

యోగా అనేది మనకు ఆరోగ్యాన్ని,మానసిక ప్రశాంతతను కలిగించే సమగ్ర సాధన పద్ధతి.యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యకర జీవన శైలిని అలవరుచుకోవటం, మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవటం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ కార్యాలయ సముదాయంలోని అధికారులు, ఉద్యోగులకు అవగాహన కల్పించినట్లు పిఐబి , సిబిసి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ తెలిపారు.

మహిళా జర్నలిస్టులు, ఉద్యోగుల కోసం 'హార్మోన్ల నుండి వైద్యం వరకు: మహిళల ఆరోగ్యంపై యోగా ప్రభావం' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం 'వార్త' నిర్వహించారు.

శారీరక, మానసిక శ్రేయస్సుపై దృష్టి సారించిన ఈ సమావేశానికి దాదాపు 50 మంది జర్నలిస్టులు, మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. పిఐబి హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి స్వాగతం పలుకుతూ, యోగా వంటి సంపూర్ణ ఆరోగ్య అభ్యాసాల ప్రాముఖ్యతను తెలిపారు.

నేచర్ క్యూర్ ఆసుపత్రికి చెందిన వైద్యురాలు డా.వైష్ణవి మహిళల ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రాణాయామం, ఆసనాలు సహా యోగా పద్ధతులను ప్రదర్శించారు. నాడి శోధన, అనులోమ్ విలోమ్ వంటి శ్వాస పద్ధతుల ద్వారా ఒత్తిడి నుంచి ఏ విధంగా ఉపశమనం కలిగుతుందో వివరంగా తెలిపారు.

## బీసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే.. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటాం

కామారెడ్డి, జూన్ 17:బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ బిల్లు సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రేవంత్ ను కోరారు. బీసీ బిల్లు ఆమోదం కోసం ఒత్తిడి తెచ్చేందుకు జులై 17వ తేదీన రైల్‌రోకో చేపడతామని ప్రకటించారు. మెదక్ జిల్లాలో కామారెడ్డిలో నేడు జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం కవిత మాట్లాడుతూ, . ఇది రాజకీయ వేదిక కాదని .. మానవ హక్కుల వేదిక అని చెప్పారు.

బీసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు సాధించుకుంటామని తెలంగాణ తెలిపారు. బీసీలంతా చైతన్యం కావాలని కోరారు. కామారెడ్డిలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్ సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు.. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరుగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులు పెట్టాలని కోరారు. ఢిల్లీకి బిల్లు పంపామని తమకు సంబంధం లేదనేలా కాంగ్రెస్ నేతలు అంటున్నారని తెలిపారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని అన్నారు.

## డ్రైవర్ నర్సింహ కుటుంబానికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆర్థికసాయం




నల్గొండ, జూన్ 17: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎం.సీ.కోటిరెడ్డి వ్యక్తిగత డ్రైవర్ ఉప్పునూతల నర్సింహ ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో మృతిచెందాడు. నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన నర్సింహ బైక్‌పై స్వగ్రామం వెళ్లి వస్తుండగా వేంపాడ్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో చనిపోయాడు. ఎమ్మెల్సీతో పాటు నర్సింహ్మ మిత్రుల సహకారంతో రూ. 4.52 లక్షలను సేకరించారు. ఈ నగదు చెక్కును మంగళవారం మిర్యాలగూడలోని నర్సింహ్మ కుటుంబానికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు అల్లి పెద్దిరాజు యాదవ్, నిడమనూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ సిరిగిరి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కేశబోయిన జానయ్య గౌడ్, పీసీకే ప్రసాద్, కిశోర్ నాయక్, షరీఫ్, తెనాలి సుధాకర్‌రెడ్డి, ఎంసీకేఆర్ యువసేన నాయకులు రవీంద్రాచారి, గడ్డమీది నాగార్జున, రాంజీ, శేఖర్ పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లాలో భార్యను హతమార్చిన భర్త

మహబూబాబాద్, జూన్ 17:( మద్యం మత్తులో భార్యను గొంతు నులిమి హత్య చేసిన ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో చోటు చేసుకుంది. తొర్రూరు సీఐ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హేమ్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్రా తండాకు చెందిన బానోత్ భద్రు సోమవారం రాత్రి మద్యం మత్తులో తన భార్య బానోత్ రంగమ్మ (55) నిద్రిస్తున్న సమయంలో గొంతు నులిమి హత్య చేశాడు.గమనించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలి కూతురు వాంకుడోత్ శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ చేయడంతోనే 2018లో ఓడిపోయాం - పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, జూన్ 17:తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ట్యాప్ చేసిన ఫోన్ నెంబర్లలో ఆయన నెంబర్ ఉండడంతో కొంత సమాచారం కావాలని సిట్ కోరడంతో కార్యాలయానికి వెళ్లారు. సిట్ కు ఆయన స్టేట్ మెంట్ ను ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డితో పాటు తన ఫోన్ కూడా ట్యాప్ చేసి తమ మూమెంట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారన్నారు. ఇదే ఫిర్యాదును గతంలో చేశాను.. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయని తెలిపారు.

చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లు టాప్ చేశారు.. ప్రజాస్వామ్యంలో రాజకీయ నేతల ఫోన్లో ట్యాప్ చేయడం హేయమైన చర్య.. ఇలాంటి చర్యకు పాల్పడ్డ నాటి సీఎం కేసీఆర్, కేటీఆర్ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేశారని మండిపడ్డారు. తాము మాత్రమే శాశ్వతంగా అధికారంలో ఉండాలి అనే చెడు ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.. 2018లో తాము ఓడిపోవడానికి కారణం కూడా ఫోన్స్ ట్యాప్ చేయడం వల్లే అని అర్థమైందని అన్నారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ లో ఉన్నాయన్నారు.

తన పూర్తి పేరు పెట్టకుండా నక్సలైట్లకు సింపతైజర్లుగా ఉన్నారని ట్యాప్ చేయడం సిగ్గుచేటని, కేటీఆర్ సిగ్గుతో తల దించుకోవాలని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేయడం దుర్మార్గమైన చర్య.. ఆనాడు తమ ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేశారని, అందుకు వారు శిక్షార్హులన్నారు. భవిష్యత్తులో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే వీరికి శిక్ష పడాల్సిందేనని అన్నారు.

## గిరిజన రైతులు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం

వరంగల్, జూన్ 17: గిరిజన రైతులు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగిన సంఘటన మంగళవారం ఇనుగుర్తి మండలంలో జరిగింది. తమ తాతల కాలం నుండి సాగు చేసుకుంటున్న భూమిలో అటవీ అధికారులు దౌర్జన్యంగా కంచెలు వేస్తున్నారని గిరిజన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాత తండాలో ఏళ్ల తరబడి గిరిజన రైతులు అటవీ భూమిని పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. గిరిజన రైతుల బాధలను చూసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలను ఇచ్చి గిరిజనులకు భరోసా కల్పించింది.

అటవీ హక్కు పత్రాలు పొందిన కూడా మళ్లీ నేడు అటవి శాఖ అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గిరిజన రైతులు వాపోతున్నారు.

వర్షాకాలం ప్రారంభంతో తమ వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యే తరుణంలో ఇలా తమ సాగు పనులను అడ్డుకోవడం అటవీ అధికారులకు తగదు అని వారిని వేడుకుంటున్నారు. ఓ గిరిజన మహిళ తమ సాగు చేసుకుంటున్న భూమిలో జెసిబితో ట్రెంచ్ తీయవద్దంటూ అధికారుల కాళ్లపై పడి ప్రాధేయపడింది. అయినా కూడా అధికారులు కనికరించడం లేదని ఆ గిరిజన మహిళ కన్నీటి పర్యంతమైంది. గిరిజనులకు అటవీ అధికారులకు మధ్య జరిగిన తోపులాటలో ఓ గిరిజన మహిళ సొమ్మసిల్లి కింద పడిపోవడంతో తోటి రైతులు ఆమెకు మంచినీళ్లు తాగించి ఆదుకున్నారు.

వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న తమ భూముల జోలికి వస్తే కోర్టులకైనా వెళ్లడానికి సిద్ధమేనని గిరిజన రైతులు అధికారులకు తెలిపారు. సంఘటన స్థలకి చేరుకున్న ఎస్సై మురళీధర్ రాజ్ ఇరువురికి గొడవలేకుండా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో ములుగు అటవీశాఖ అభివృద్ధి డివిజనల్ మేనేజర్ మాధవి గిరిజనులకు వారం రోజులు సమయం ఇస్తున్న ఈ లోగా తమ వద్ద ఉన్న అటవీ హక్కు పత్రాలను వచ్చి తమకు సమర్పించాలని లేకుంటే ట్రించులు తీస్తామని రైతులకు చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.



# అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థినికి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు



కరీంనగర్, జూన్ 17:(నేటినిజం ప్రతినిధి) సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా సంతృప్తితోపాటు పలు విషయాలపట్ల పూర్తిగా అవగాహన వస్తుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని ప్రతిష్ఠాత్మక గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు సంపాదించుకోవడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళల పరిరక్షణ ముఖ్యంగా ప్రాచీన కాలంనాటి వైభవాన్ని, కట్టడాలను గురించి తెలుసుకోవాలని తద్వారా చరిత్రను తెలుసుకున్న వారవుతారని వారు చెప్పారు. కళలలో పాల్గొనడం ద్వారా ఆనందం కల్గుతుందని, ఒత్తిడి నుండి విముక్తి కలగడంతో పాటు పని పట్ల శ్రద్ధ వహించడంతో విజయం వరిస్తుందని చెప్పారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పాల్గొనేందుకు నిధులు కేటాయించి ఉత్సాహాన్ని నింపాలని కోరారు. చాలా మంది పలు కార్యకలాపాల నుండి ఎదురయ్యే ఒత్తిడిని అదిగమించడానికి పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని సూచిస్తు ఇటీవల కాలంలో రాష్ట్ర రాజధానిలోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించినటువంటి గిన్నీస్బుక్ ఆఫ్ రికార్డ్స్ పాఠశాలకు చెందినటువంటి బుక్క దీత్య, 5వ తరగతి, హైద్రాబాద్లో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో సుమారు 2400 మందికి పైగా కళాకారులతో కలిసి పాల్గొని ప్రతిష్ఠాత్మక గిన్నీస్బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు కైవసం చేసుకోవడం చాలా చారిత్రాత్మక విజయమని, చిన్నారి ఇతరులకు ఆదర్శమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. అత్యుత్తమ విజయ సాధించిన విద్యార్థినికి పుష్పగుచ్చంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు.

ఈ అభినందన సభలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి తరం మహిళా లోకానికి ఆదర్శం వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి

## – ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ




రాజన్న సిరిసిల్ల, జూన్ 16:(నేటినిజం ప్రతినిధి): బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన తొలితరం తొలి మహిళ పోరాట యోధురాలు వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి 167 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడ లో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఝాన్సీ రాణి లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక అని, ఝాన్సీ రాజు బాజీరావు పీష్వాను వివాహం చేసుకొని అతని మరణం తర్వాత ఝాన్సీ రాజ్యానికి రాణి అయి ఆమె పలు యుద్ధాల్లో ఆరితేరిందని, దీంతో ఆమె ఝాన్సీ రాణిగా పేరు పొందారని, ఆమె కత్తి పట్టి కదన రంగంలోకి దిగిందంటే శత్రువుల వెన్ను వెనకాల్సిందేనని ,1857 లో జరిగిన భారతదేశ తిరుగుబాటు లో ప్రముఖ పాత్ర పోషించారని, ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర సంగ్రామం లో ఆ తర్వాత అనేకసార్లు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి ఝాన్సీ రాణి చరిత్ర కు ఎక్కారని, అందుకే నేటికీ ప్రజల హృదయాల్లో రాజ్యమేలుతూ చిరస్థాయిగా నిలిచిపోయారని, నేటి సమాజంలో ప్రతి మహిళ ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని " పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దుర్శేటి లక్ష్మీనారాయణ, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుపేదలు, అట్టడుగు వర్గాలు ఆర్థికంగా ఎదగాలి

## -కేంద్ర మంత్రి చౌదరి జయంత్ సింగ్ ను కలిసిన కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్



హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుపేదలు, అట్టడుగు వర్గాలు ఆర్థికంగా ఎదగాలని కేంద్ర మంత్రివర్యులు చౌదరి జయంత్ సింగ్ అన్నారు. మంత్రి హైదరాబాద్ వచ్చిన సందర్భంగా రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ సంఘ సభ్యులతో కలిసి మంత్రిని కలిసారు. ఈసందర్భంగా గత ఐదు సంవత్సరాల నుండి ఆరోగ్యకరమైన నవ సమాజం నిర్మించాలని రైతు సంక్షేమ సేవా సంఘం అహర్నిశలు రైతుల సంక్షేమం గురించి పని చేస్తున్న సంఘాన్ని మంత్రి చౌదరి జయంత్ సింగ్ దృష్టికి వెళ్లారు. దీనితి సంఘ సభ్యులకు ఆహ్వానించి సంఘ ముఖ్య ఉద్దేశం తెలుసుకొని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ సంఘ సభ్యులతో కలిసి మాజీ భారత ప్రధాని గౌరవ చౌదరి చరణ్ సింగ్ జ్ఞాపకార్థం ఒక జ్ఞాపక మంత్రికి బహుకరించారు అనంతరం కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటది ప్రజలు బాగుంటరు ఆహారంతోనే ఆరోగ్య పూర్వికులు పండించిన పంటలు పండిస్తూ ప్రకృతిని ప్రజలను కాపాడాలని మన తెలుగు రెండు రాష్ట్రాలలో సంఘం బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తుందని తెలిపారు ఈ సంఘానికి కేంద్ర మంత్రివర్యులు నా సంపూర్ణ సహకారము ఉంటాదని హామీ ఇచ్చారు. తన చేతుల ఉన్న స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుపేదలకు దళితులకు అట్టడుగు వర్గాలకు ఆర్థికంగా ఎదగనికి నా వంతు సహకారం ఉంటదని కేంద్ర మంత్రివర్యులు చౌదరి జయంత్ సింగ్ హామీ ఇచ్చారు మంత్రి కలవడం మన సంక్షేమ సంఘం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతాదని సంఘ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ వి అశోక్ గౌడ్ గొర్ల శ్రీనివాస్ యాదవ్ వి విశ్వనాథ్ ఎం ఆగమయ్య ముదిరాజ్ ఆర్ బలరాం యాదవ్ బి శ్రీనివాస్ గౌడ్ హరికృష్ణ ఆంజనేయులు హుస్సేన్ బంగారు యాదవ్ శ్రీనివాస్ టి రమేష్ నేత యాదగిరి గౌడ్ మధు యాదవ్ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు

# విద్యా సంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి

## – అజిత్

ఖమ్మం, జూన్ 17:కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని, విద్యా సంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్క అజిత్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పాల్వంచ ఎంఈఓ ఎ.శ్రీరామ్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అజిత్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం పునః ప్రారంభమైనందున ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి తక్షణమే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విద్యార్థులకు అందజేయాలన్నారు.

పాల్వంచలో విచ్చలవిడిగా వెలసిన కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని, విద్యా హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేయడమే కాక విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ మొత్తం తమ వద్దే కొనుగోలు చేయాలని షరతులు పెడుతున్నారని, వాటిని తమ ఇష్టానుసారంగా అధిక రేట్లకు అమ్ముతున్నారని, తక్షణమే ఈ అమ్మకాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు ఏఐఎస్ఎఫ్ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల సృజన్, వెంకటేశ్, చందూలాల్, రాజు, శ్రీకాంత్, రాము పాల్గొన్నారు.

# అందరి సమిష్టి కృషితోనే లాభాల్లోకి ఆర్టీసీ సంస్థ : ఆర్టీసీ ఈడీ ఖుస్రోషా ఖాన్

హైదరాబాద్, జూన్ 17:: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితోనే సంస్థ లాభాల వైపు పయనిస్తోందని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రోషా ఖాన్ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్టీసీ డిపోను మంగళవారం ఆయన సందర్శించారు. డిపోలోని ఉద్యోగులు, కార్మికులతో గేటు మీటింగ్ నిర్వహించి ఇష్టాగోష్టిగా గత ఏడాది కాలంగా కార్మికులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయడంతో సంస్థ లాభాల వైపు మళ్లిందన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తే రానున్న ఒకటి రెండేళ్లలో కష్టాలు దూరం అవుతాయని అన్నారు. స్థానిక డిపోకు అవసరమైన కొత్త బస్సుల కేటాయింపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారమయ్యేలా చూస్తానని భరోసా కల్పించారు. అనంతరం స్థానిక డిపో గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రీజియన్, డిపో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్లు ట్యాప్ చేయడం దుర్మార్గపు చర్య

## -ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటివారున్నా శిక్షపడాల్సిందే

## -టిపిసిసి ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అసెంబ్లీ ఎన్నికల వేళ టిపిసిసి ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయన మంగళవారం జూబ్లీహిల్స్ పిఎస్ కు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. తమ ఫోన్లు ట్యాప్ చేసి బిఆర్ఎస్ రాజకీయ లబ్ది పొందిందని, ఇంకోసారి ఇలాంటివి జరగకుండా అధికారులు, నేతలకు శిక్ష పడాలని సూచించారు. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీయనాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య అని ఫోన్ల ట్యాపింగ్ కు పాల్పడిన మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు. సుమారు 650 మంది సీనియర్ కాంగ్రెస్ నేతల ట్యాప్ జరిగిందని, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటివారున్నా శిక్షపడాల్సిందేనని డిమాండ్ చేశారు. రాజకీయ నేతలు, జడ్జిలు, అధికారుల ఫోన్లనూ ట్యాప్ చేశారని, ఫోన్ ట్యాపింగ్ వల్లే కాంగ్రెస్ కొన్ని స్థానాల్లో ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. నక్సల్స్ తో సంబంధం ఉందనే అసత్య ఆరోపణలతో తమ ఫోన్లు ట్యాప్ చేశారని, బిఆర్ఎస్ ఓడిపోతుందని తెలిసే.. హార్డ్ డిస్కలను ధ్వంసం చేశారని మహేశ్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు.

# మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయండి : యాకూబ్ పాషా

ఖమ్మం, జూన్ 17:రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా మంగళవారం మైనారిటీ గురుకులాల కార్యదర్శి పి.షఫీవుల్లాను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సుమారు 10,000 మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ పూర్తి చేసి బయటికి వస్తున్నారని, మైనారిటీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేక మంది విద్యార్థులు గత ఐదేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులకు స్వస్తి పలుకుతున్నారన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 79 గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయని, మైనారిటీలకు మాత్రం ఒక్క కళాశాల కూడా లేదన్నారు. ఈ కారణంగా గురుకులాల్లో ఇంటర్ వరకు చదివిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున బాల, బాలికల కోసం వేర్వేరుగా ఉమ్మడి జిల్లాల్లో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు



ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన గురుకులాల కార్యదర్శి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండి.ఫారూఖ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# వస్త్ర పరిశ్రమ సొసైటీలకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలి

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 16:(నేటినిజం ప్రతినిధి): వస్త్ర పరిశ్రమ సొసైటీలకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని, చీరల ఉత్పత్తి ఆర్డర్ సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లతో కలిసి మ్యాక్స్ సంఘాల సభ్యులు, ఆసాములతో చీరలు ఉత్పత్తి పురోగతి పై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిర్దేశిత గడువు లోగా చీరల ఉత్పత్తి ఆర్డర్ పూర్తి చేయాలని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి ఆర్డర్ ద్వారా వస్త్ర పరిశ్రమ కార్మికులకు 8 నెలల పాటు ఉపాధి లభిస్తుందని, మిగిలిన 4 నెలలు కూడా ఉపాధి లభించే విధంగా ప్రభుత్వం తరపున ఇతర శాఖల నుంచి కూడా పెద్ద ఎత్తున ఆర్డర్లు నేత కార్మికులకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.

చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ మాట్లాడుతూ

చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాల సభ్యులకు 2 చీరలు పంపిణీ చేసేందుకు నిర్ణయించిందని అన్నారు. మొదటి చీర పంపిణీ చేసేందుకు సిరిసిల్లలోని 131 మ్యాక్స్ సొసైటీ పరిధిలోని 16 వేల 424 పవర్ లూమ్స్ కు 4 కోట్ల 30 లక్షల మీటర్ల చీరల ఉత్పత్తి ఆర్డర్ జనవరి , మార్చి నెలలో 2 దశలలో అందించిందని అన్నారు.

మొదటి దశ 2 కోట్ల 12 లక్షల మీటర్ల చీరలు ఉత్పత్తి ఆర్డర్ కు ఇప్పటి వరకు సిరిసిల్ల చేనేత సొసైటీ నుంచి 50 లక్షల 55 వేల మీటర్ల ఉత్పత్తి పూర్తి చేశామని అన్నారు. ఆగస్టు 15 నుంచి చీరల పంపిణీ చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

చీరల ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సంబంధిత మ్యాక్స్ సంఘాల సభ్యులకు సూచించారు. 45 రోజుల గడువు లో 3.5 కోట్ల మీటర్ల చీర ఉత్పత్తి చేయాలని, ప్రతి సొసైటీ పరిధిలో ఉన్న పవర్ రూమ్స్ పూర్తి స్థాయిలో చీరల ఉత్పత్తి చేయాలని, రోజూ ఉదయం, రాత్రి షిఫ్టుల్లో పని చేయాలని అన్నారు. పవర్ లూమ్స్ లలో కార్మికుల సంఖ్య పెంచాలని అన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పాత బకాయిలను దాదాపు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేశామని, ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని శాఖల నుంచి బట్ట ఉత్పత్తి ఆర్డర్లు చేనేత సొసైటీలకు వస్తుందని, స్కూల్ , అంగన్ వాడి ఏక రూప దుస్తులు ఆర్డర్ అందించామని, రాబోయే రోజుల్లో దేవాదాయ శాఖ నుంచి కూడా మరో ఆర్డర్ వస్తుందని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్రింద ప్రభుత్వం అందించే ఆర్డర్ చాలా పెద్దదని, దాదాపు సంవత్సరానికి 9 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. సొసైటీలు చీర ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో ఆర్డర్ పూర్తి చేయాలని అన్నారు. ప్రతి సొసైటికు కేటాయించిన లక్ష్యంలో కనీసం 50 శాతం జూన్ నెలాఖరు వరకు పూర్తి చేయాలని, లేని పక్షంలో సంబంధిత సొసైటీ ఆర్డర్ రద్దు చేసి 50 శాతం పూర్తి చేసిన సొసైటీలకు ఆర్డర్ అందిస్తామని అన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన ఆర్డర్ లన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తున్నామని తెలిపారు. కార్మికులకు ప్రతి వారం 4 వేల నుంచి 5 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రెండో చీర ఆర్డర్ కు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం సొసైటీల వారీగా చీరల ఉత్పత్తి పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేసి వారి నుండి ఖచ్చితమైన ఆర్డర్ వివరాలను నమోదు చేశారు.

### టెక్స్టైల్స్ పార్క్ యజమానులతో సమావేశం

సిరిసిల్ల సమీపంలోని టెక్స్టైల్స్ పార్క్ యజమానులతో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా టెక్స్టైల్స్ పార్క్ యజమానులు తమకు ప్రభుత్వం నుంచి మరిన్ని వస్త్రం ఉత్పత్తి ఆర్డర్లు ముందస్తుగా ఇవ్వాలని, తమ సమస్యలు పరిష్కరించాలని

చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ ను కోరారు. వివిధ శాఖలకు అవసరమైన ఆర్డర్స్ అందజేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నాణ్యతతో వస్త్రాలు ఉత్పత్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, చేనేత జౌళి శాఖ జేడీ ఎన్ వెంకటేశ్వర్ రావు, ఏడీ రాఘవరావు, వివిధ మ్యాక్స్ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు యజమానులు ఆసాములు, టెక్స్టైల్స్ పార్క్ యజమానుల సంఘం అధ్యక్షుడు అన్నల్ దాస్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశలపై కాంగ్రెస్ పార్టీ నీళ్లుచల్లింది

## -ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తోంది

## - రైతుల భరోసా ఇవ్వబోతున్నామని చెప్పడం కేవలం ఓట్ల కోసమే

## - బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): ప్రజల ఆశలపై కాంగ్రెస్ పార్టీ నీళ్లుచల్లిందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ విమర్శించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ చేసిన నిర్వాహక వైఫల్యాల దృష్ట్యా ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు. గత ఎన్నికల సమయం లో బీసీ, ఎస్సీ, యువ డిక్లరేషన్‌ల పేరుతో ప్రజలకు పెద్దఎత్తున హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక పాలనలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి మాట వినడం లేదని ఎవా అధికారులపై లీకులు ఇచ్చే స్థితికి దిగజారడం దురదృష్టకరం. సీఎంఓ ఆదేశాలకే అధికారులు స్పందించకపోతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. పాలన వైఫల్యాలను ఉద్యోగులపై నెట్టే ప్రయత్నం.. ప్రభుత్వ వైఫల్యాల బాధ్యతను ఉద్యోగులపై నెట్టడం అనాగరికపు చర్య. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలనను గాలికి వదిలిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. రిటైర్డ్ ఉద్యోగులకు పీఎఫ్, పెన్షన్, ఇతర బెనిఫిట్లు ఇవ్వలేమన్న మాటలు ముఖ్యమంత్రి నోటివెంట రావడం దురదృష్టకరం. రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగుల హక్కులను అడ్డుకునే అధికారం లేదు. విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. బీటెక్, ఎంటెక్ విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లోనే ఉన్నాయి. ఉద్యోగాలకు అర్హత ఉన్నా, సర్టిఫికెట్లు లేకపోవడంతో ఉద్యోగాలు దొరక్క చాలామంది కూలీపనిచేసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్యశ్రీ కార్డుతో ఆసుపత్రుల్లో చికిత్స జరగడం లేదు. బకాయిల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులు సేవలు అందించడం లేదు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక ప్రజాప్రయోజన పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ఆపేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పటివరకు ప్రభుత్వం విడుదల చేయలేదు. కళ్యాణలక్ష్మి, నిరుద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ వంటి పథకాలను నిలిపివేసి, ఉద్యోగుల్ని మరియు రిటైర్డ్ ఉద్యోగులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అమలు చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ఆయుష్మాన్ వయో వందన పథకంతో 70 సంవత్సరాల పైబడిన వృద్ధులందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమాతో కూడిన ఆయుష్మాన్ కార్డు కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికీ వీటిని ప్రజలకు ఇవ్వడం లేదు. పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటిని విస్మరించి, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రైతుల భరోసా కింద రైతులకు 9 రోజుల్లో రూ.9,000 కోట్లు ఇవ్వబోతున్నామని చెప్పడం కేవలం ఓట్ల కోసమే. ఇప్పటికైనా తక్షణమే ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. ఒక్క వర్గానికే కాదు, అన్ని వర్గాలకు సమానంగా న్యాయం చేయాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు బాధ్యత సీఎంపై ఉంది. ప్రజల నుంచి ఓట్లు పొందిన ప్రతి హామీని సీఎం అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

# సాగర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



నల్గొండ, జూన్ 17: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను మంగళవారం ట్రైనీ ఐఏఎస్ ల బృందం సందర్శించింది. తెలంగాణ దర్శనంలో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు జిల్లా శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాగార్జున సాగర్ ను సందర్శించారు. దీనిలో భాగంగా నాగార్జునసాగర్ బుద్ధవనం చేరుకున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించబడిన సౌరబ్ శర్మ, నిజామాబాద్ జిల్లాకు కేటాయించబడిన క్యారోలిన్ చింగ్ తీ అమ్మావై లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్, (లోకల్ బాడీస్ ) ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్ తో సమావేశమయ్యారు. అనంతరం బుద్ధ వనంలోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి సమర్పించారు. బుద్ధ చరితవనం, జాతక వనం, ధ్యానవనం, స్థూప వనంను సందర్శించి మహా స్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు.

సమావేశ మందిరంలో బుద్ధవనం డాక్యుమెంటరీని వీక్షించిన అనంతరం బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు ట్రైనీ ఐఏఎస్ లకు బుద్ధవనం బ్రోచర్లతో పాటు, పంచశీల కండువాలను బహుకరించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జునకొండ చారిత్రక విశేషాలను, నాగార్జునసాగర్ డ్యామ్ వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ దర్శన్ డిస్టిక్ ట్రైనింగ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రోటోకాల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దండ శ్రీనివాస్ రెడ్డి, విజయ విహార్ మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

# నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపు : కె.వి ప్రసాద్

నల్గొండ, జూన్ 17:: నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కె.వి ప్రసాద్ అన్నారు. నల్లగొండకు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాజిరెడ్డి అత్త కొండ సుశీలమ్మ అకాల మరణం పొందడంతో ఆమె నుండి సేకరించిన నేత్రాలను వారి కుటుంబ సభ్యులు మంగళవారం ట్రస్ట్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. ఐ డోనేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరినాథ్, పుల్లారావు, దామర యాదయ్య, జయప్రకాశ్‌రెడ్డి, ప్రవీణ్, విజయ్ కుమార్, ప్రనూష, సతీశ్, శైలజ, భాస్కర్, నిమ్మల పిచ్చయ్య, అమరేందర్‌రెడ్డి నేత్రదాత కుటుంబ సభ్యులకు ప్రగాడ సంతాపాన్ని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.